క్లుప్తంగా

చెట్లను నరికే వారిపై చర్యలు తీసుకోండి



చల్లపల్లి: నీడనిచ్చే చెట్లను నరికే వారిపై చర్యలు తీసుకోవాలని స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు సోమవారం మచిలీపట్నం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో అర్జీ అందజేశారు. స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమంలో భాగంగా గత పదేళ్ల నుంచి రోడ్లకు రెండువైపులా చెట్లను పెంచుతున్న విషయం విదితమే. నీడనిచ్చే చెట్లను కొందరు అకారణంగా నరికివేసి పర్యావరణానికి హాని కల్గిస్తున్నారని తెలిపారు. చెట్లను నరికే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు వేముల షణ్ముఖ శ్రీనివాస్, సజ్జా ప్రసాద్, ప్రాతూరి శాస్త్రి, బోగాది వాసుదేవరావు అర్జీ సమర్పించారు.

దేవాలయ కౌలు చట్టం తక్షణం రద్దు చేయాలి

నాగాయలంక: దేవాలయాల భూములు కౌలుకు ఇచ్చే విధానంలో కూటమి ప్రభుత్వం కొత్త చట్టం తీసుకు రావడం విచారకరమని దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, గణపేశ్వరాలయాల ఫౌండర్ ట్రస్టీ మండల శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు) సోమవారం ఆయన ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఎటువంటి బహిరంగ కౌలు వేలం పాటలు జరపకుండా తమ వారికి దేవాలయాల భూములు కట్టబెట్టడానికే కూటమి ప్రభుత్వం గుట్టు చప్పుడు కాకుండా జీఓఎంఎస్ నం.136 పేరుతో కొత్త చట్టం తీసుకువచ్చిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే కొత్త దేవాలయ కౌలు చట్టం రద్దు చేయాలని రాంబాబు డిమాండ్ చేశారు.

మత సామరస్యంతో జీవించాలి



చల్లపల్లి: ఉగ్రవాదం నశించాలని, ప్రతి ఒక్కరూ మతసామరస్యం కలిగి ఉండి దేశ రక్షణకు ఐక్యంగా ఉండాలని ఇమ్మానియేల్ యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. శాలిపేట హోలీఫైర్ చర్చిలో సోమవారం ఉదయం అసోసియేషన్‌కు చెందిన పాస్టర్లు సమావేశం నిర్వహించారు. తొలుత పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన వారికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సాల్మన్ రాజు, సెక్రటరీ బిషప్ డాక్టర్ ఎం.మరియ కుమార్, ట్రెజరర్ తాతా సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర

నాగాయలంక: గ్రామంలో కొలువైన మండవ వంశీయుల ఇలవేల్పు గంగమ్మతల్లి ఆలయంలో తృతీయ వార్షిక జాతర మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత తెల్లవారుజామున శుద్ధి కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. అనంతరం అంబా సాయికిరణ్ శర్మ బ్రహ్మత్వంలో అభిషేకాలు తదితర పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మండవ మధుసూదనరావు(పెద బుజ్జి), జానకిలక్ష్మి దంపతులు పీటలపై కూర్చున్నారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు, నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వెయ్యి మందికి అన్న సంతర్పణ జరిగింది. ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, స్వచ్ఛ నాగాయలంక సొసైటీ గౌరవాధ్యక్షుడు మండవ బాబూరావు, మండవ వంశీయులు, ఆడపడుచులు, తదితరులు పాల్గొన్నారు.

కెనడీ రోడ్డులో ఆక్రమణల తొలగింపు



మచిలీపట్నంటౌన్: నగరంలో ఆక్రమణల తొలగింపు కొనసాగుతూనే ఉంది. నగర కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఆక్రమణల తొలగింపు పనులు చేస్తున్నారు. సోమవారం నగరంలోని కెనడీ రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్‌లపై ఉన్న ఆక్రమిత కట్టడాలను, బడ్డీలను తొలగించారు. జేసీబీ, క్రేన్‌ల సాయంతో పనులు చేస్తున్నారు. వీటిని టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీహరిప్రసాద్ పర్యవేక్షించారు.

ఘనంగా అంకమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

బొబ్బర్లంక(మోపిదేవి): మండలంలోని బొబ్బర్లంక గ్రామంలో సోమవారం శ్రీ అంకమ్మ తల్లి ఆలయ పదో వార్షికోత్సవం వైభవంగా ప్రారంభించారు. లోక కళ్యాణార్థం చండీహోమం, రుద్రహోమం అనంతరం పూర్ణాహుతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. అనంతరం అన్న సమారాధన జరిగింది. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, విజయలక్ష్మి దంపతులు, సర్పంచ్ దొప్పలపూడి గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

సమాచారశాఖలో ఉద్యోగుల బెంబేలు!

- ఉన్నతాధికారి పోకడలకు ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు
- ఇప్పటికే ఇద్దరు ఉద్యోగులు దీర్ఘకాలిక సెలవు!
- మిగిలిన సిబ్బంది కూడా అదే బాటలో..



బందరులో సమాచార పౌర సంబంధాలశాఖ కార్యాలయం

చిలకలపూడి(మచిలీపట్నం): సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో ఉద్యోగులు రోజురోజుకూ బెంబేలెత్తిపోతున్నారు. ఆ శాఖ మచిలీపట్నం కార్యాలయంలోని ఉన్నతాధికారి ప్రవర్తన కారణంగా ఏం చేయాలో పాలుపోక ఇబ్బంది పడుతున్నారు. సమాచారశాఖ కార్యాలయంలో ఆ ఉన్నతాధికారితో పాటు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్, డివిజనల్ పీఆర్వో, సీనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, పబ్లిసిటీ అసిస్టెంట్‌తో పాటు నలుగురు ఆఫీస్ సబార్డినేట్లు పనిచేస్తున్నారు. ఇటీవల డివిజనల్ పీఆర్వో ఒకరు పదవీ విరమణ చేశారు. దీంతో 10 మంది ఉద్యోగులు ఈ కార్యాలయంలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. సమాచారశాఖ ప్రభుత్వానికి సంబంధించిన వివరాలు, సమావేశాలకు సంబంధించిన సమాచారం అందించడంతో పాటు పాత్రికేయులకు ఎప్పటికప్పుడు ఇన్ఫర్మేషన్ అందిస్తూ ఉంటారు. ఈ విధానంలో ఆ శాఖ ఉన్నతాధికారి ప్రవర్తన కారణంగా కార్యాలయంలోని ఉద్యోగులు అవస్థ పడుతున్నారు.

ఒత్తిడితో పని చేస్తున్నా..

ఏదైనా కార్యాలయంలో ఉన్నతాధికారి కిందిస్థాయి ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ సూచనలు చేస్తూ విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటారు. అయితే సమాచారశాఖ కార్యాలయంలో అందుకు భిన్నంగా నేను జిల్లా అధికారి మీరంతా నేను చెప్పినట్లు చేయాలనే రీతిలో ఆ అధికారి ప్రవర్తనతో ఉద్యోగులు బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల ఒక డివిజనల్ పీఆర్వో పదవీ విరమణ చేయడంతో ప్రస్తుతం ఆ అధికారితో పాటు ఒక డివిజనల్ పీఆర్వో ఉన్నారు. వీరిద్దరూ కలెక్టర్ నిర్వహించిన సమావేశాలు లేదా మంత్రి కార్యక్రమాలకు వెళ్లటంతో పాటు ఇతర ప్రోగ్రాములు కూడా వీరు కవర్ చేస్తూ పాత్రికేయులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నారు. ఇంత ఒత్తిడిలో కూడా తాము సమయంతో పనిలేకుండా పని చేస్తున్నా మాపై ఒత్తిళ్లకు గురిచేయడంతో పాటు మానసిక వేదన అనుభవించేలా ప్రవర్తిస్తున్నారని ఉద్యోగులు వాపోతున్నారు.

ఇలా అయితే ఎలా!

సదరు ఉన్నతాధికారి కొన్ని సమయాల్లో ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేసేందుకు మెమోలు కూడా జారీ చేస్తున్నారని తెలుస్తోంది. అయితే ఇటువంటి పరిస్థితుల్లో తాము పనిచేయలేకపోతున్నామని ఇరువురు ఉద్యోగులు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినట్లు సమాచారం. ఇదే రీతిలో మిగిలిన ఉద్యోగులు కూడా ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. సదరు జిల్లా అధికారి ఉద్యోగులను, పాత్రికేయులను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో జరిగే కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సరైన సమాచారం అందక తప్పులతడకలతో కూడిన సమాచారాన్ని అందిస్తూ సవరణలు ఇస్తున్నారు. సమాచారశాఖ కార్యాలయంలో జరుగుతున్న పరిస్థితిపై కలెక్టర్ డీకే బాలాజీ దృష్టిసారించి శాఖను గాడిలో పెట్టాలని ఉద్యోగులు, పాత్రికేయులు కోరుతున్నారు.

సమష్టి కృషితో మెరుగైన ఫలితాలు



కప్పలదొడ్డి హైస్కూల్ విద్యార్థులను సత్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు

గూడూరు: సమష్టి కృషితో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కప్పలదొడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు నిరూపించారని గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు అన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో బందరు డివిజన్ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాల విద్యార్థులను పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యాన సోమవారం ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించడానికి జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ప్రత్యేక శ్రద్ధతో స్టడీ మెటీరియల్స్‌ను జెడ్పీ ద్వారా అందించారన్నారు. విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించడమే కాకుండా ఆ సమయంలో అల్పాహార ఏర్పాట్లు కూడా చేశామన్నారు. వీటిని అందిపుచ్చుకున్న స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల వసతులకు చేయూత అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. 586 మార్కులు సాధించి డివిజన్ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన ఉమ్మిటి నాగ శివ విఘ్నేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయని ఎం.జ్యోతి ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో సర్పంచి యక్కల మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు పేరిశెట్టి తేజోవతి, మాజీ సర్పంచి కట్టా మునేశ్వరరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపండి

ఘంటసాల: రైతులందరూ ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఘంటసాల కేవీకే ప్రాంగణంలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన రాయితీపై రైతులకు యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రభుత్వం రైతులకు 50 శాతం సబ్సిడీపై యంత్ర పరికరాలను అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. ఇంతటి భారీ కార్యక్రమాన్ని నిర్వహించిన ఏవో మురళీకృష్ణను ఎమ్మెల్యేతో పాటు ఏడీఏ శ్యామల అభినందించారు. అన్నదాత సుఖీభవకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. మండల వ్యవసాయశాఖ అధికారి కె.మురళీకృష్ణ మాట్లాడుతూ ఘంటసాల మండలంలో 13 రైతు సేవా కేంద్రాల పరిధిలోని 96 మంది రైతులకు రూ.13.30 లక్షల రాయితీతో యంత్ర పరికరాలను అందించామన్నారు. కార్యక్రమంలో మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల, తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, ఎంపీడీవో డి.సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు, ఇన్‌చార్జి ఏపీఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గోకర్ణేశ్వరుడి కల్యాణోత్సవాలకు వేళాయే..

కోడూరు: దివిసీమలో అతి పురాతనమైన శైవక్షేత్రంగా పేరుగాంచిన లింగారెడ్డిపాలెంలోని బాలాత్రిపురసుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామి ఆలయం కల్యాణోత్సవ శోభతో ఉట్టిపడుతోంది. మంగళవారం నుంచి స్వామివారి కల్యాణోత్సవాలను ప్రారంభించడానికి దేవదాయ అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ఈఓ సీహెచ్ సుధాకరరావు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, త్రిశూలపూజ, వాస్తు పూజ అనంతరం స్వామివారిని పెండ్లికుమారుడిగా అలంకరించనున్నట్లు చెప్పారు. 7న బిందెతీర్థం, మూలమూర్తికి పంచామృతాభిషేకాలు, గ్రామ బలిహరణ, రాజ్యలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, 8వ తేదీ రాత్రికి జగాజ్యోతి ఉత్సవం, స్వామివార్ల కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. 9న కల్యాణమూర్తులకు గ్రామోత్సవం, రాత్రికి రథోత్సవం, 10న పూర్ణాహుతి, శ్రీపుష్పయాగ ఉత్సవాలతో కల్యాణోత్సవాలను ముగించనున్నట్లు చెప్పారు. కల్యాణోత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

పెడన ఎంపీడీఓగా అరుణకుమారి

పెడన: పెడన ఎంపీడీఓగా అరుణకుమారిని నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఆమె అవనిగడ్డ మండలం ఈఓపీఆర్‌డీగా విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగోన్నతిపై ఆమెను పెడన ఎంపీడీఓగా నియమించారు. ఒకటి, రెండు రోజుల్లో ఆమె బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శిరీష తెలిపారు.

సెలవుపై పీహెచ్‌సీ వైద్యాధికారి

పెడన: పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) వైద్యాధికారి పర్వేజ్‌హైదర్ ఈ నెల 25వ తేదీ వరకు మెడికల్ సెలవు పెట్టినట్లు రెండో వైద్యాధికారి డాక్టర్ మీనాదేవి తెలిపారు. ఆయన స్థానంలో గూడూరు సీహెచ్‌ఎస్‌కు చెందిన డాక్టర్ చందనను ఇన్‌చార్జిగా నియమించారని ఆమె పేర్కొన్నారు.

మినుములు క్వింటా రూ.9 వేలకు కొనుగోలు చేయాలి



చల్లపల్లిలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతు సంఘం నేతలు



బంటుమిల్లిలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘ నాయకులు, రైతులు

చల్లపల్లి: కొనుగోలు కేంద్రాల్లో క్వింటాకు రూ.9 వేల చొప్పున మినుములను ప్రభుత్వం కొనుగోలు చేయాలని మండల రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ధరల స్థిరీకరణ నిధి నుంచి రూ.9వేలు చొప్పున మినుములు కొనుగోలు చేయాలని, అన్నదాత సుఖీభవ కింద రైతులకు, కౌలురైతులకు రూ.20వేలు చొప్పున బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని కోరారు. సార్వా పంటకు 75శాతం సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని, డ్రైనేజీ, పంట కాలువను పూడికతీత తీయించాలన్నారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం నేతలు యద్దనపూడి మధు, నంద్యాల ప్రభు, గోళ్ల సాంబశివరావు, బొందలపాటి వెంటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

బంటుమిల్లి: రైతులకు గిట్టుబాటు ధరలు, అన్నదాత సుఖీభవ పథకం, మినుము కొనుగోలు కేంద్రాలు తదితర సమస్యలపై సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ దీర్ఘకాల రైతు సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మినుము కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని, అన్నదాత సుఖీభవ పథకంలో రైతులకు, కౌలు రైతులకు ప్రభుత్వం రూ. 20వేలను బ్యాంకు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. వేసవిలో ముందుగానే డ్రెయినేజి పనులు చేపట్టి పంటలు నీటిపాలు కాకుండ చర్యలు తీసుకోవాలని వినతిపత్రములో డిమాండ్ చేశారు. ఆక్వా రైతులకు గిట్టుబాటు ధరల అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తాహసీల్దార్ కే. పూర్ణచంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, సీపీఎం నాయకుడు ఎం. శ్రీనివాసరావు, సీఐటీయు నాయకుడు ఎల్. అజయ్‌ఘోష్, వీ. శ్యాం, బొడ్డు నాగరాజు పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత విద్యకు ఆన్‌లైన్ దరఖాస్తులు

నాగాయలంక: మండలంలోని మూడు ప్రైవేటు పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం 25 శాతం ఫ్రీ ఎడ్యుకేషన్‌పై ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నాగాయలంక ఎంఈఓ టీవీఎం రామదాసు సోమవారం తెలిపారు. మండల కేంద్రంలోని స్కాలర్స్ ఇంగ్లిషు మీడియం హైస్కూలు, విద్యాభారతి పబ్లిక్ స్కూలు, మారుతీ విద్యానికేతన్ డిజిటల్ స్కూల్లో అవకాశం పొందవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన తల్లిదండ్రులు ఈ నెల లోపు 15వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో http://cre.ap.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

సందడిగా గుండాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

గూడూరు: మల్లవోలులోని గుండాలమ్మ తల్లి ఆలయ 14వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాసగాని శ్రీనివాసరావు, సర్పంచులు కూనపెద్ది పెద్ది రాజులు, అన్నం హరిరామకృష్ణ, పలగాని మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి



చల్లపల్లి ఎంపీడీఓ కార్యాలయం బయట నిరసనలో పాల్గొన్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

చల్లపల్లి: ఉపాధి శ్రామికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని వారికి పేస్లిప్పులు కూడా ఇవ్వాలని కోరుతూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్ట ప్రకారం 100 రోజులు పని కల్పించాలని లేకపోతే వారికి నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్జీ పెట్టుకున్న వారికి కొత్త కార్డులు మంజూరు చేయాలని, కొత్తగా వివాహమైన వారికి నూతన కార్డులు మంజూరు చేయాలని కోరారు. అన్ని గ్రామాల్లోనూ మేట్లను ఏర్పాటుచేసి వారికి రూ.5వేలు పారితోషికం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో 20 గ్రూపులు దాటితే అక్కడ మరో ఫీల్డ్ అసిస్టెంటును కేటాయించాలని కోరారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో నిధులు కేటాయింపు పెంచాలని, పని దినాలు 200 రోజులు పెంచాలని డిమాండు చేశారు. అనంతరం ఎంపీడీఓ ఎ.వి.రమణకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం నేత యద్దనపూడి మధు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మేడేపల్లి వెంకటేశ్వరరావు, బండారు కోటేశ్వరరావు, సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా పాల్గొన్నారు.

మోపిదేవి: పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యాన ఉపాధి కూలీలు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిరసన తెలిపారు. ప్రధానంగా చట్టప్రకారం 100 రోజుల పని దినాలు కల్పించాలని, లేకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు సీఐటీయూ నాయకులు చిరివెళ్ల రాజశేఖర్, కర్రా వెంకటేశ్వరరావు, బెజవాడ నాగేశ్వరావు, కోసూరు రామాంజనేయులు అందించారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ తరగతులు



కొడాలి గ్రంథాలయంలో విద్యార్థుల పుస్తక పఠనం



బందరులో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

ఘంటసాల: కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యాన ఘంటసాల, కొడాలి గ్రామాల్లోని గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. సోమవారం ఘంటసాల గ్రంథాలయంలో అధికారి ఎం.శరత్‌కుమార్ ఆధ్వర్యాన విద్యార్థులకు ఇంగ్లిషు గ్రామర్ చెప్పించడంతో పాటు స్కిప్పింగ్ పోటీలు నిర్వహించి యోగా నేర్పించారు. కొడాలి గ్రంథాలయంలో అధికారి సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు క్యారమ్స్, చెస్ పోటీలు నిర్వహించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రను వివరించారు. పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు శాఖా గ్రంథాలయాల్లో సోమవారం ఉత్సాహంగావేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించారు. పోర్టు రోడ్డులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు చింతగుంటపాలెం, హౌసింగ్‌బోర్డు కాలనీ, చిలకలపూడి, ఈడేపల్లి శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు పలు అంశాల్లో తర్ఫీదునిచ్చారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిషు, లెక్కల సబ్జెక్టులను బోధించారు. యోగాసనాలు చేయించారు. పలు పుస్తకాలు చదివించి, కథలు చెప్పారు. చెస్, క్యారమ్స్ ఆటలు ఆడించారు. కార్యక్రమాలను జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు.

రేపు నాగాయలంకలో వాసవీ కన్యకాపరమేశ్వరి జన్మదినోత్సవం

నాగాయలంక: స్థానిక పార్వతీసమేత కన్యకా పరమేశ్వరీ సమన్విత నగరేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రీవాసవీ సేవాదళ్, మండల శ్రీఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీకన్యకా పరమేశ్వరీదేవి 4642వ జన్మదినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు సోమవారం తెలిపారు. వైశాఖ శుద్ధ దశమి పురస్కరించుకుని ఆ రోజు ఉదయం 108 లీటర్ల ఆవుపాలతో కన్యకాంబకు పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు.

నాడు – నేడుకు 'చంద్ర'గ్రహణం

- ముందుకు సాగని రెండో విడత పనులు
- అర్ధాంతరంగా నిలిచిన పనులు
- అత్యవసరమైతేనే నిధులు ఇస్తామంటున్న ఉన్నతాధికారులు
- అవీ ఇంకా విడుదల చేయని వైనం
- పూర్తయిన పనులకు జరగని బిల్లుల చెల్లింపు



నిలిచిన రైలుపేట మునిసిపల్ పాఠశాల భవనం పనులు

మచిలీపట్నంటౌన్: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు అవుతున్నా మచిలీపట్నం నియోజకవర్గంలో నాడు – నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి పనులు, నిర్మాణాలకు చంద్రగ్రహణం వీడలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిధులకు కొదవ లేకుండా పనులు పరుగులుపెట్టగా ఎన్నికల అనంతరం ఎన్డీఏ అధికారంలోకి రావడంతో పనులపై శ్రద్ధ చూపలేదు. ఫలితంగా పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. అత్యవసరమైన పనులు చేయించండి నిధులు మంజూరు చేస్తామని విద్యాశాఖ ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులను ఆదేశిస్తున్నారు. కానీ నిధులు మంజూరు చేయడం లేదు. దీంతో నాడు-నేడు రెండో దశ పనులను చేయడానికి ఎవరూ చొరవ చూపడం లేదు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ఎప్పటికో

నియోజకవర్గంలోని ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, మునిసిపల్ పాఠశాలలో మొత్తం 20 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తపసిపూడి, లేడీయాంప్తిల్, రాంజీ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆయా పాఠశాలల్లో బోధన ఇబ్బందిగా మారింది. ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులకు మంచి మార్కులు సాధించలేకపోతున్నారు.

ఈ ఏడాదైనా సక్రమంగా అందేనా..!

జగనన్న విద్యాకానుకను పాఠశాలలు తెరిచేలోపే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కిట్లు పూర్తిస్థాయిలో సిద్ధం చేసి అందించేవారు. గతేడాది విద్యా సంవత్సరంలో పాఠశాలల తెరిచిన అనంతరం కానుక కిట్లను పాఠశాలల విద్యార్థులకు అందజేశారు. కూటమి ఏ ఏడాది అయినా విద్యా సంవత్సర ప్రారంభం నాటికే విద్యాకానుక కిట్లను అందిస్తుందో లేదోననే అనుమానాలను విద్యార్థుల తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు.

నిధులు ఇస్తారో లేదో అని..

ఒకవేళ పనులు చేయిస్తే నిధులు ఇస్తారో లేదోననే మీమాంసతో వాటి జోలికెళ్లడం లేదు. కొద్దిపాటి పనులు చేసి రంగులు వేస్తే తరగతుల నిర్వహణకు అనువుగా ఉన్న పాఠశాలల్లో నిర్మాణాలు సైతం నిలిచిపోవడంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. స్థానిక రైలుపేటలోని మునిసిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేశారు. కొద్దిపాటి పనులే మిగిలి ఉన్నా అవి జరగకపోవడంతో అసంపూర్తిగా ఉన్న భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. మచిలీపట్నం వలందపాలెం పోతేపల్లి రోడ్డులోని బీసీ బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో నూతన భవన నిర్మాణానికి పునాదులు వేశారు. ప్రభుత్వం మారడంతో అవి అలానే ఉన్నాయి. భవన నిర్మాణానికి తెచ్చిన ఇనుప చువ్వలు వర్షం ముంపునీటిలో మగ్గుతున్నాయి. మచిలీపట్నం నియోజకవర్గంలో మొదటి విడత నాడు – నేడు పథకం ద్వారా 67 పాఠశాలలను రూ. 13.16 కోట్లతో అభివృద్ధి చేశారు. రెండో విడతలో 60 పాఠశాలలను రూ. 20.87 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. అయితే వీటిలో 34 పాఠశాలల పనులే పూర్తయ్యాయి. మరో 15 పాఠశాలల పనులు తుదిదశకు చేరాయి. మరికొన్ని మధ్యలోనే నిలిచిపోయాయి.

దళిత మహిళపై దాడి ఘటనలో కేసు

పెడన: మండలంలోని బలిపర్రు గ్రామానికి చెందిన దళిత మహిళ జల్దుల తిరుమలపై దాడి చేసినవారిపై ఆదివారం రాత్రి కేసు నమోదైంది. ఈ నెల ఒకటో తేదీన ఘటన జరిగింది. దీనిపై ఈ నెల 5వ తేదీన దళిత మహిళపై దాడి వార్త 'సాక్షి'లో ప్రచురితమైంది. అదే రోజున డీఎస్పీ సీహెచ్ రాజా మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు తిరుమలను, ఆమె ఇంటి వద్ద భర్త వెంకటేశ్వరరావుతోపాటు పరిసర ప్రాంతవాసులను విచారణ చేశారు. అనంతరం డీఎస్పీ.. దాడికి పాల్పడిన గాదె సురేంద్ర, గాదె నరేంద్ర, గాదె నాగలపై ఎస్సీ, ఎస్టీ కేసులను నమోదు చేసినట్లు పెడన పోలీసులు తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి రూ.50 వేలు విరాళం



కోడూరు: సముద్రతీర ప్రాంతం రామకృష్ణాపురంలో అప్‌గ్రేడ్ చేసిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి రూ.50వేలు విరాళం ఇచ్చి దాతృత్వాన్ని చాటారు. రామకృష్ణాపురం గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను ఈ ఏడాది ప్రభుత్వం జెడ్పీ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేసి తీరప్రాంత విద్యార్థులకు పదో తరగతిని అందుబాటులోకి తీసుకు వచ్చింది. అప్‌గ్రేడ్ అయిన పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు సాయం చేయడానికి ముందుకొచ్చారు. ఇదే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి చిముటూరి వెంకటేశ్వరరావు కుమారుడు వనవెంకట శివనాగేంద్రబాబు సోమవారం పాఠశాల అభివృద్ధికి రూ.50 వేల నగదును స్వచ్ఛందంగా హెచ్ఎం కారాని నాగార్జునకు అందించారు. దాతను గ్రామస్తులు, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు. పీఎంసీ కమిటీ చైర్మన్ అద్దంకి ఉష, ఉపాధ్యాయులు మన్నే ప్రేమ్‌చంద్, పెరవలి రాంబాబు, అద్దంకి పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.